

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి
ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. - 8లో



పటిష్ట బందోబస్తు
కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. - 8లో



బ్యాంకు అధికారుల తీరుపై నిరసన
వరదయ్యపాళెం ఎస్‌బీఐలో పథకాల నగదును పాత బకాయిలకు జమ చేస్తున్నారంటూ లబ్ధిదారులు ఆందోళన చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అన్నమయ్య జయంత్యుత్సవాలు ప్రారంభం



గోష్ఠిగానం చేస్తున్న అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు

తిరుపతి కల్చరల్: శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు గురువారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం తిరుపతికి చెందిన ఫణి నారాయణ, పూర్ణిమ బృందం ప్రదర్శించిన భక్తి సంకీర్తనలు, అనంతరం టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి బుల్లెమ్మ బృందం ఆలపించిన భక్తి సంకీర్తనలు భక్తి సాగరంలో ముంచెత్తాయి

వాహనాలకే పెట్రోల్ పట్టాలి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిబంధనల మేరకు జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు పెట్రోల్ బంక్ యాజమాన్యాలు వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజల్ పట్టాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రాజారఘువీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్ యజమాన్యాలు పెట్రోల్, డీజల్‌ను బాటిళ్లు, డ్రమ్స్, ఇతర పాత్రల్లో పట్టకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పెట్రోల్ బంక్ రిజిస్ట్రేషన్ గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్స్ చేస్తామని హెచ్చరించారు.

లింగ నిర్ధారణ చట్టం పటిష్టం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు పెద్ద నేరంగా భావించాలని, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. స్కానింగ్ సెంటర్లను ప్రతి నెలా తనిఖీ చేయడంతోపాటు, సరైన అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్య విభాగం నుంచి అనుమతులు పొందకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ల మార్పు చేస్తే జరిమానా, జైలు శిక్షలు ఉంటాయని చెప్పారు. గుర్తింపును రద్దు చేస్తామని చెప్పారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అనుమానాలు ఉంటే 102, 104 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీఐఓ శాంత కుమారి, దిశా డీఎస్పీ కాటమరాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి, పీడియాట్రిస్ట్ డాక్టర్ కిరీటి, రేడియాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు, డెమో బాబునెహ్రూ రెడ్డి, డీపీఎంఓ శ్రీనివాసరావు ఎన్‌జీఓ సభ్యులు పాల్గొన్నారు.

పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలి

తిరుపతి క్రైమ్: అధికారులు పనితీరును మరింత మెరుగుపరు చుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. గురువారం జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రధాన విభాగాలైన ఎస్బీ, డీసీఆర్బీ, ఎలక్షన్ సెల్, ఏవో ఆఫీస్, ఇతర పరిపాలన సంబంధిత విభాగాలను గురువారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం పని తీరు మరింత మెరుగు పడాలని ఆదేశించారు.

రథాన్ని లాగుతున్న అశేష భక్తజనం (ఇన్‌సెట్) రథంపై విశేషాలంకరణలో స్వామివారు





తిరువీధుల్లో మెరిసిన గోవిందుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం శ్రీగోవిందరాజస్వామివారు రథంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగుతూ పరవశం చెందారు. కళా బృందాలు, కోలాట బృందాల నృత్య ప్రదర్శనలు ముందు వెళుతుండగా తిరునగరిలో రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

తిరుపతి కల్చరల్ : బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమై రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాలవీధి, బేరివీధి, గాంధీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథ మండపం వద్దకు చేరుకుంది. భక్తులు దారిపొడవునా కొబ్బరికాయలు సమర్పించి, హారతులు పడుతూ స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి రథోత్సవంలో దారిపొడవునా భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. అనంతరం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, నమ్మాళ్వార్ల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అశ్వవాహన సేవ అత్యంత వేడుకగా సాగింది. స్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆళ్వార్ తీర్థమైన కపిలతీర్థంలో చక్రస్నానం వేడుకగా జరుగనుంది. అక్కడ చక్రస్నానం అనంతరం పీఆర్ తోటకు వేంచేపు చేసి సాయంత్రం 6 గంటలకు తిరిగి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుంటారు

స్వర్ణరథంపై శ్రీవారి దేవేరి

- నేత్రపర్వం..స్నపన తిరుమంజనం



స్వర్ణరథంపై తిరువీధుల్లో దర్శనమిస్తున్న పద్మావతి అమ్మవారు

చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన గురువారం ఉదయం స్వర్ణరథంపై తేజోమయిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం 7.45 గంటలకు అమ్మవారిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి వేంచేపుగా తీసుకొచ్చి రథంపై కొలువుదీర్చారు. అనంతరం జై పద్మావతి.. జైజై పద్మావతి నామస్మరణల నడుమ అమ్మవారు రథంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం 3గంటలకు ఉద్యానవనం మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణ నడుమ కనుల పండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7.30గంటలకు సర్వాలంకార శోభితురాలైన పద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

చూచు వారలకు చూడ ముచ్చటగా..

అశేష భక్త జన సందోహమే అతిథులుగా.. అర్చకులే పెళ్లి పెద్దలుగా.. వేదమంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాలు మోగుతుండగా గురువారం పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి పరిణయోత్సవం నయనానందకరంగా సాగింది. ఇదే ముహూర్తంలో పలు జంటలు ఒక్కటయ్యాయి. వేలాదిగా భక్తులు తరలిరావడంతో పెంచలకోనలో నమో నారసింహ నామస్మరణ మార్మోగింది.

- కమనీయం నారసింహుని పరిణయోత్సవం
- అశేషంగా తరలివచ్చిన భక్తజనం
- ఒక్కటైన పలు జంటలు



పెంచలకోన లక్ష్మీనరసింహ ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో నృసింహ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9.35 గంటలకు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. విష్వక్సేన పూజ నిర్వహించి కన్యాదాన కార్యక్రమం నిర్వహించారు. శుభ ముహూర్తాన స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. శ్రీవారి కల్యాణ మూహూర్తానికి పలు నూతన జంటలు ఒక్కటయ్యాయి. కల్యాణం అనంతరం స్వామి వారికి భక్తులు భారీగా చదివింపులను అందించారు. ప్రత్యేక హుండీల్లో భక్తులు చదివింపుల కానుకలుగా రూ.83,720 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీవారి కల్యాణం చూసేందుకు ఈ ఏడాది అశేషంగా భక్తులు తరలిరావడంతో పెంచలకోన కిక్కిరిసింది. డీసీ విజయ సాగర్‌బాబు, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, దేవుడు వెల్లంపల్లి ఈఓ శ్రీధర్, సీఐ సుబ్రమణ్యం, ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్య స్వామి, టీడీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

రథంపై నూతన దంపతులు

గురువారం రాత్రి ఏడు గంటలకు రథంపై స్వామివారు ఉభయనాంచారులతో కలిసి కోన తిరువీధుల్లో విహరించారు. పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై కొత్త దంపతులు కొలువుదీరి కోన వీధుల్లో విహరించడం క్షేత్ర సంప్రదాయం. గోవిందా..గోవిందా అంటూ భక్తులు రథాన్ని లాగి తన్మయత్వం చెందారు. రాత్రి పది గంటలకు గజ వాహనంపై కొలువుదీరి స్వామి, అమ్మవార్లు పెంచలకోన మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

నేడు చక్రస్నానం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 9గంటలకు అశ్వవాహనసేవ, 11 గంటలకు ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.



పాల్గొన్న అశేష భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తులు

అల్లర్లకు పాల్పడితే సహించం

రేణిగుంట: ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా అవాంఛనీయ పరిస్థితులను కలుగజేసేలా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. రేణిగుంట డీఎస్పీ కార్యాలయం, అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్, మొబైల్ పాయింట్లు పెట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



రేణిగుంట పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వర్చువల్ విధానంలో జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ సాయంత్రం 4 గంటలకు ముగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ ఏర్పాట్లను వివరిస్తూ కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కోడ్ నిబంధనల మేరకు 95శాతం ఏర్పాట్లు పూర్తి చేశామని, జూన్ 1వ తేదీ నాటికి వందశాతం పూర్తి చేస్తామని వివరించారు. 90 సీసీ కెమెరాలతో నిఘా, కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

3రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

తిరుపతి పార్లమెంటు నియోజక వర్గ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 15 టేబుళ్ల ఏర్పాటుతో 3 రౌండ్లలో సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఈవీఎంల కౌంటింగ్‌కు చంద్రగిరికి 20 టేబుళ్లు, మిగిలిన నియోజకవర్గాలకు 14 టేబుళ్ల ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ క్రమంలో చంద్రగిరికి 20 రౌండ్లు, గూడూరు 21, సూళ్లూరుపేట 22, వెంకటగిరి 22, తిరుపతి 20, శ్రీకాళహస్తి 21, సత్యవేడు 20 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేస్తామని వివరించారు. అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకుంటున్నట్లు వెల్లడించారు.



ఏర్పాట్లను వివరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

సికింద్రాబాద్ సీనియర్ డీసీఎంగా బాలాజీ కిరణ్


బాలాజీ కిరణ్

తిరుపతి(అలిపిరి): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డీసీఎంగా ఐఆర్‌టీఎస్ అధికారి వై.బాలాజీ కిరణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన వై.బాలాజీ కిరణ్ 2013 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి. ఈయన గతంలో గుంతకల్ డివిజన్ సీనియర్ డీఓఎంగా, సికింద్రాబాద్ డివిజన్ గూడ్స్ డీఓఎంగా, రామగుండం ఏరియా అధికారిగా పనిచేశారు.

విధ్వంస కుట్ర?

నగరి నియోజకవర్గం పుత్తూరులో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఓట్ల లెక్కింపు జరగముందే తానే ఎమ్మెల్యే అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయించారు. కొందరు దీన్ని చూసి అంత తొందరేల భానూ.. అంటూ నవ్వుకున్నారు. ఇదంతా ఒక పథకం ప్రకా రం రెచ్చగొట్టడమేనని భావిస్తున్నారు. నేర చరిత కలిగిన వారిని జనంలోకి రప్పించడం.. గతంలో గంజాయి సరఫరా జరిగిందని ప్రచారం జరిగిన ప్రాంతంలో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభించడం ఏంటని చర్చించుకుంటున్నారు. అది బ్యాడ్మింటన్ కోర్టు కాదు.. విధ్వంస కుట్రలకు కేంద్రంగా చేసుకున్నారని అనుమానిస్తున్నారు. ఇదంతా ఎన్నికల కమిషన్‌కు కనబడలేదా అని జనం ప్రశ్నిస్తున్నారు.

- ఓట్ల లెక్కింపునకు ముందే ఎమ్మెల్యే భానుప్రకాష్ అంటూ ఫ్లెక్సీలు
- అంత తొందరెందుకు భాను అంటున్న నగరి ప్రజలు
- పట్టించుకోని ఎన్నికల అధికారులు
- కోడ్ ఉల్లంఘించి గతంలో మూసివేసిన జిమ్‌లో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం
- గంజాయి కేసులో అరెస్టయిన వారే బాడ్మింటన్ కోర్టు నిర్వాహకులు
- విధ్వంసాలు సృష్టించేలా టీడీపీ చర్యలు



ఎమ్మెల్యే భానుప్రకాష్ అంటూ టీడీపీ నేతలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ


బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభోత్సవంలో గాలి భానుప్రకాష్

నగరి : ఆలూ లేదు, చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లుంది టీడీపీ నేతల పరిస్థితి. ఓట్ల లెక్కింపు జరగలేదు. గెలుస్తారో లేదో కూడా తెలియదు. నగరిలో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఎమ్మెల్యే అంటూ పుత్తూరు పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడం హాస్యాస్పదంగా మారింది. ఇదేం విడ్డూరం అంటూ జనం నవ్వుకుంటున్నారు.

పుత్తూరు మున్సిపాలిటీ చింతలగుంటలో గతంలో బీఎస్ జిమ్ నిర్వహించేవారు. ఏడాది క్రితం ఈ జిమ్ నిర్వాహకుడు టీడీపీ నేత హరి విశాఖపట్నం అరకు వద్ద గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు చిక్కాడు. ఆ తర్వాత ఆ జిమ్ నిరుపయోగంగా మారింది. ఈ జిమ్ నుంచే గంజాయి సరఫరా జరిగేదంటూ అప్పట్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. అనంతరం ప్రచారాల్లోను, పలు కార్యక్రమాల్లోను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌తో పాటు గంజాయి స్మగ్లర్, అతని అనుచరులు పాల్గొనడం అప్పట్లో వివాదాస్పదమైంది. వివాదాలకు చిరునామాగా ఉన్న వీరంతా తాజాగా మరో వివాదానికి తెరతీశారు. నిరుపయోగంగా ఉన్న జిమ్‌ను బ్యాడ్మింటన్ కోర్టుగా మార్చి ఎన్నికల కోడ్ ఉండగానే టీడీపీ అభ్యర్థితో ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో భానుప్రకాష్ ఎమ్మెల్యే, నగరి అంటూ ముద్రించి ప్రదర్శనగా ఉంచారు.

కోడ్ వర్తించదా?

ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్న టీడీపీ నాయకులకు ఎన్నికల నిబంధనలు వర్తించవా అంటూ నగరి నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బహిరంగంగా ఒక అభ్యర్థి ఎమ్మెల్యే అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ప్రారంభోవాలు చేస్తుంటే వారిపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రెచ్చగొట్టి విధ్వంసాలకు పాల్పడేందుకేనా?

ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే పుత్తూరు టీడీపీ నాయకుల దుశ్చర్యను చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజలు కూడా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. రాజకీయ పార్టీలను రెచ్చగొట్టి.. గొడవలు సృష్టించి విధ్వంసాలకు పాల్పడేందుకే పథకం వేశారని స్థానికులు భయపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించేందుకే నేరచరిత కలిగిన వారిని టీడీపీ నాయకులు జనంలోకి తీసుకొస్తున్నట్టు సమాచారం.

వైఎస్ రాజారెడ్డికి నివాళి


రాజారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి వర్ధంతి పులివెందులలో గురువారం ఘనంగా జరిగింది. రాజారెడ్డి సమాధి వద్ద జరిగిన ఈకార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పాల్గొన్నారు. పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. అతి చిన్న వయసులోనే వైఎస్ రాజారెడ్డితో పాటు జైల్లో గడిపిన జ్ఞాపకాలు, దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డితో గడిపిన తీపి గుర్తులను కరుణాకరరెడ్డి గుర్తు చేసుకున్నారు.

బ్యాంకు అధికారుల తీరుపై నిరసన

- పథకాలు, పింఛన్ నగదు పాత బకాయిలకు జమ
- బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగిన బాధితులు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు అత్యుత్సాన్ని చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన వైఎస్సార్ చేయూత, ఆసరా, పింఛన్ నగదును పాత బకాయిలకు మళ్లిస్తుండడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా ఏడాది క్రితం ఇందిర క్రాంతి పథకంలో ఏపీఎం, సిబ్బంది గిరిజన, దళిత మహిళల పేరిట బినామీ డ్వాక్రా సంఘాలను సృష్టించి రూ.3కోట్లకు పైగా నిధులను స్వాహా చేసిన బకాయిలకు అదే మహిళల పేరిట రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన నగదును జమ చేసేందుకు బ్యాంకు అధికారులు ప్రయత్నిస్తుండడంతో నిరుపేద వర్గాల వారు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారికి మద్దతుగా సీపీఐ ఆధ్వర్యంలో గురువారం వరదయ్యపాళెంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదుట బాధితులు నిరసన తెలిపారు. నిరక్షరాస్యులైన గిరిజనుల పేరిట పెద్దఎత్తున డ్వాక్రా రుణాలను గోల్‌మాల్ చేశారని, అక్రమాలకు పాల్పడిన ఇందిర క్రాంతి పథకం ఏపీఎంను అరెస్టు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ ఆరోపించారు. అక్రమాలు చేసిన వారిని అరెస్టు చేయకుండా, ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన సంక్షేమ పథకాల నిధులను అక్రమ బకాయిలకు మళ్లించడమేమిటని బ్యాంకు అధికారులను ఆయన ప్రశ్నించారు. నెలసరి పింఛనే ఆధారంగా వృద్ధులు జీవిస్తున్న తరుణంలో ఆ నగదును కూడా బకాయిలకు జమ చేస్తూ బ్యాంకు మేనేజర్ అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించి తక్షణమే లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాలని బ్యాంకు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

- కంట్రోల్ రూమ్ నుంచే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన
- కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు
- హింసాత్మక చర్యలను ఉపేక్షించం
- రాజకీయ పార్టీల నేతలకు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ సూచన


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల వద్ద కంట్రోల్ రూమ్ నుంచే సీసీ కెమెరాల సాయంతో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పరిశీలించేందుకు వీలుందని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన గురువారం సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద అత్యంత పటిష్టమైన భద్రత కల్పించినట్లు చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు వారి ఏజెంట్లు సైతం రోజు స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించవచ్చునని చెప్పారు. లేదంటే అక్కడ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించినా మొత్తం సమాచారం తెలుస్తుందని వివరించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు రాజకీయ పార్టీల నేతలు పూర్తి సహకారం అందించాలని కోరారు. హింసాత్మక సంఘటనలను దూరంగా ఉండాలని సూచించారు. కోడ్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని, ఎంతటి వారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. కౌంటింగ్ రూమ్‌లోకి సెల్‌ఫోన్‌లతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని తెలిపారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్

కౌంటింగ్ సిబ్బంది జూన్ 4వ తేదీ ఉదయం 7 గంటలకే న కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రారంభాలని..తర్వాత ఈవీఎంల కౌంటింగ్ ఉంటుందని వివరించారు. కౌంటింగ్ గుర్తింపుకార్డుతోపాటు పాస్‌ను అభ్యర్థులతోపాటు వారి ఏజెంట్లు తప్పక తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తమ ఏజెంట్ల నియామకానికి ఐదు రోజుల ముందే పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సర్వేపల్లి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మాత్రమే తిరుపతిలో లెక్కింపు చేస్తారని, ఈవీఎంల ఓటింగ్ నెల్లూరులోని పద్మ ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కిస్తారని వెల్లడించారు. అభ్యర్థులు లేదా ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి వచ్చేటప్పుడు పెన్ను, పెన్సిల్, నోట్ ప్యాడ్, 17సీ డూప్లికేట్ కాపీ తెచ్చుకోవచ్చని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో అవసరం అయిన మేరకు స్థలం లేకపోవడంతో అందరికి అవకాశం ఇవ్వలేకపోతున్నామని, గుర్తింపు పొందిన పార్టీలకు మాత్రమే లెక్కింపు వద్ద చోటు కల్పిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన వారికి లెక్కింపు ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా అవసరం అయిన మేరకు టీవీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఎలాంటి ర్యాలీలు విజయోత్సవ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ పెంచెల కిషోర్, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 48 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 15,880 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,632 మంది, మొత్తం 18,512 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచామన్నారు. ఈ క్రమంలోనే ఒకేషనల్‌తో పాటు జనరల్ విభాగానికి చెందిన అన్ని సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో వాల్యుయేషన్ చేసేలా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుందని తెలిపారు.

గూడ్స్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాపూరు: రాపూరు రైల్వేస్టేషన్ (వెల్లికల్లు) సమీపంలో కృష్ణపట్నం నుంచి ఓబులాపురం వెళుతున్న గూడ్స్ ఢీకొని గురువారం ఉదయం 9గంటలకు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ హరి చందన తెలిపారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. మృతదేహం ఛిద్రం కావడంతో పూర్తి వివరాలు తెలియలేదన్నారు. స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ హర్షవర్ధనరాజు
- 135 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు
- తిరుపతిలో పోలీసుల మాక్ డ్రిల్


గురువారం మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న బలగాలు

తిరుపతి క్రైమ్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. గురువారం ఎంఆర్‌పల్లె సమీపంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ సజీవుగా సాగేందుకు ప్రణాళికలో భాగంగా 135 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, మూడు మాబ్ కంట్రోల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. మూడు మాబ్ కంట్రోల్ టీమ్‌లు నిరంతరం నిఘాలో ఉంటాయని పేర్కొన్నారు. మొదటి టీమ్ కౌంటింగ్ సెంటర్, రెండో టీమ్ ఇన్నర్ గార్డెన్ వద్ద కౌంటింగ్ కేంద్రానికి దాదాపు 600 మీటర్ల వరకు తమ ఆధీనంలోకి తీసుకుని మోహరిస్తుందని తెలిపారు. మూడో టీమ్ కౌంటింగ్ కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం మొహరించి, కౌంటింగ్ కేంద్రంలోకి ఎలాంటి అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా అవుటర్ కార్డును వద్దనే అదుపు చేస్తుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 1500 మంది పోలీసులు, రెండు కంపెనీల సాహిదా బలగాలు కొన్ని ఏపీఎస్పీ బెటాలియన్లు ఉంటాయన్నారు. ఇప్పటికే రౌడీ షీటర్లందరికీ హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. అవసరమైతే బైండోవర్ చేస్తామన్నారు. ఏఎస్పీలు కులశేఖర్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు కూలీ దుర్మరణం

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పండ్లూరు వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున మోటార్ బైక్‌ను కారు వేగంగా ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ బల్లి రంగయ్య(40) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు .. మండల పరిధి లోని వెముగుంటపాళెం గ్రామానికి చెందిన బల్లి రంగయ్య కూలి పనులు చేసుకుంటు భార్య,ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. గురువారం గూడూరులోని సోదరి ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో పండ్లూరు వద్ద గూడూరు వైపు నుంచి వస్తున్న కారు అతి వేగంగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో రంగయ్య కిందపడగా, ఆయన శరీరంపై కారు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంటి పెద్ద రంగయ్య మృతితో కుటుంబసభ్యుల ఆర్తనాదాలు అక్కడివారిని కలచివేశాయి.

ఆరోగ్యశ్రీ క్లెయిమ్స్ పరిష్కారానికి చర్చలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: ఆరోగ్యశ్రీ పెండింగ్ క్లెయిమ్స్‌లో 50 శాతం విడుదలకు చర్యలు ప్రారంభమయ్యాయని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరించారు. కలెక్టరేట్‌లో ఆయన గురువారం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేట్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కొంత మొత్తంలో క్లెయిమ్స్‌ను విడుదల చేసిందని చెప్పారు. ఆరోగ్య సేవలు నిలిపివేస్తే లబ్ధిదారులకు వచ్చే ఇబ్బందులను వివరించారు. ఆస్పత్రులకు పెండింగ్‌లోని క్లెయిమ్‌ల విడుదలకు సంబంధించి ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చలు కొనసాగుతున్నాయి చెప్పారు. నిధుల విడుదలకు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను పరిగణనలోకి తీసుకుని ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని కోరారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్, సంకల్ప హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగరాజు డాక్టర్ అనంతనాగ్, వెంకటరమణ హార్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వెంకట రమణ, సాయి సుధా హాస్పిటల్ యజమాని డాక్టర్ సుధారాణి, స్నేహ హాస్పిటల్ యజమాని డాక్టర్ ఓ.రమేష్, రష్ హాస్పిటల్ డాక్టర్ శివకుమార్, అమర హాస్పిటల్ సీఈవో వేణుగోపాల్, రమాదేవి హాస్పిటల్ సీఈవో చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.